క్లుప్తంగా

రైస్‌మిల్ భూముల పరిశీలన



మాట్లాడుతున్న ఆర్డీఓ హేమలత

సీతానగరం: మండలంలోని అప్పయ్యపేట సమీపంలో ఉన్న శ్రీ సత్య రా అండ్ బాయిల్డ్ రైస్ మిల్లుకు సంబంధించిన భూములను రెవెన్యూ డివిజనల్ అధికారి కె.హేమలత గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ రైస్‌మిల్ నెలకొల్పే సమయంలో కొనుగోలు చేసిన భూములను ఇండస్ట్రియల్‌కు అనుసంధానం చేయాలని నిర్వాహకులు దరఖాస్తు చేసు కోవడంతో రికార్డుల ప్రాప్తిగా భూమిని తనిఖీ చేసి నివేదిక తయారు చేయనున్నామని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎన్వీ రమణ, మండల సర్వేయర్ శంకరరావు, ఆర్ఐ ఎస్.శ్రీనివాసరావు,వీఆర్వోలు పి.కుమార్ నాయుడు, ఎం.సింహాచలం, రైస్ మిల్లు యజమాన్య ప్రతినిధులు పాల్గొన్నారు.

లక్ష్మీనృసింహ స్వామికి ప్రత్యేక పూజలు



లక్ష్మీనృసింహస్వామి వారికి పూజలు చేస్తున్న అర్చకులు

సీతానగరం: మండల కేంద్రంలో సువర్ణముఖి నదీతీరాన గల లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో స్వామికి గురువారం ఆలయ ప్రధాన అర్చకుడు పీసపాటి శ్రీనివాసాచార్యులు పర్యవేక్షణలో అర్చకులు భక్తులతో ప్రత్యేక పూజలు చేయించారు. స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు భక్తిశ్రద్ధలతో క్యూలో ఉండి పూజల్లో పాల్గొన్నారు.

వినాయక చవితి వేడుకలకు అనుమతి తప్పనిసరి



ఎస్సై కె.నీలకంఠం

సీతానగరం: రానున్న వినాయక చవితి వేడుకల సందర్భంగా మండలంలోని గ్రామాల్లో ఉత్సవాలు నిర్వహించడానికి పోలీసు వారికి సహకరించాలని, పలుజాగ్రత్తలు తీసుకోవాలని ఎస్సై కె.నీలకంఠం కోరారు. ముందు జాగ్రత్తచర్యల్లో భాగంగా ఉత్సవ కమిటీ సభ్యులు విధిగా పోలీసు వారినుంచి అనుమతులు పొందాలని స్పష్టం చేశారు.


త్వరితగతిన ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన

పార్వతీపురంటౌన్: త్వరితగతిన ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని ప్రజలకు అవగాహన కల్పించామని ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ అన్నారు. ఈ మేరకు గురువారం పట్టణంలోని 6వ వార్డులో లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మంజూరుచేసిన జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. పేదలకు ఇస్తున్న నవరత్న పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సొంత విత్తనాలతో బహుళ ప్రయోజనాలు



మాట్లాడుతున్న ఏడీ శారదదేవి

భామిని: రైతులు తమకు కావాల్సిన విత్తనాలను సొంతంగా తయారు చేసుకోవడం ద్వారా బహుళ ప్రయోజనాలు పొందవచ్చని పార్వతీపురం మన్యం జిల్లా వనరుల కేంద్రం(డీఆర్‌సీ) సహాయ సంచాలకులు బి.శారదదేవి, కె.శ్రీనివాస్ అన్నారు. సొలికిరి ఆర్బీకేలో గురువారం నిర్వహించిన రైతు శిక్షణ కేంద్రంలో రైతులకు పలు సూచనలు చేశారు. ఇప్పటికే అందించిన ఫౌండేషన్ సీడ్‌తో పంటల్లో తీసుకోవాల్సిన సస్యరక్షణ, కేళీల నివారణ, గాలిబాటలతో ప్రయోజనాలు వివరించారు. గురండి, ఘనసరలో గ్రామీణ విత్తనోత్పత్తి పథకంలో రైతులకు శిక్షణ ఇచ్చారు. అనంతరం ఫౌండేషన్ సీడ్ వేసిన పొలాలను సందర్శించి సస్యరక్షణ చర్యలు వివరించారు. వ్యవసాయాధికారులు కిమిడి మన్మధరావు, కొర్ను సింహాచలం, ఏఎలు జ్యోతి, ఈశ్వరరావు, గొర్లె ఎలీసా, రైతుమిత్రలు ఉన్నారు.

సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం



వార్డు సమస్యలు అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే జోగారావు

● ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురంటౌన్: సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు గురువారం పుర పాలక సంఘం పరిధిలో ఉన్న 4వ వార్డును స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, మున్సిపల్ అధికారులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ప్రజలను కలుసుకుని వార్డులో మంచినీరు బాగా వస్తుందా, కాలువలు శుభ్రంగా ఉన్నాయా, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలన్నీ అందరికీ సకాలంలో అందుతున్నాయా, ఇవి కాకుండా ఇంకా వార్డులో ఏమైనా సమస్యలు ఉన్నాయా? అని అడిగి తెలుసుకుని వార్డులో అపరిశుభ్రంగా ఉన్నచోట శుభ్రం చేయాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి మద్దతు తెలిపి 2024 సాధారణ ఎన్నికల్లో ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, వార్డ్ కౌన్సిలర్ కోరాడ శ్రీనివాసరావు (నాని), వివిధ వార్డుల కౌన్సిలర్‌లు ఎస్.లావణ్య, మజ్జి శశికర్, నిమ్మకాయల సుధీర్, వి.నేతాజీ, పి.జయంతి, బి.ఆనంద్, జి. గాయత్రి, జేసీఎస్ కన్వీనర్ గొర్లి మాధవరావు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, రెడ్డి రవికుమార్, పాలవలస శ్రీనివాసరావు, సిరిపురపు ప్రకాశ్, కోరాడ చిట్టి, ఎం.తవిటి నాయుడు, ఆకుల శ్రీనివాసరావు, జిల్లా ఎస్ఎస్ఎల్ అధ్యక్షుడు ఎస్.శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, సచివాలయం ఉద్యోగులు మున్సిపల్ సిబ్బంది వలంటీర్లు స్థానిక పెద్దలు ప్రజలు తదితరులు పాల్గొన్నారు

వైఎస్సార్‌సీపీ కార్యకర్త మృతికి సంతాపం



కిరణ్ మృతదేహం వద్ద సంతాపం తెలియజేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురం మున్సిపాలిటీ 9వ వార్డు నిర్మల కాలనీలో నివాసం ఉంటున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు, చర్మకార కార్పొరేషన్ స్టేట్‌డైరెక్టర్ జొన్నాడ శ్రీదేవి చిన్న సోదరుడు జొన్నాడ కిరణ్ (38) మృతదేహానికి ఎమ్మెల్యే జోగారావు గురువారం అంజలి ఘటించారు. అనారోగ్య కారణంగా కిరణ్ ఆకస్మికంగా మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న ఆయన స్థానిక ప్రజాప్రతినిధులు నాయకులతో కలిసి నిర్మల కాలనీకి చేరుకుని కిరణ్ పార్థివ దేహానికి అంజలి ఘటించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేసి ఓదార్చారు. మృతుడు కిరణ్‌కు భార్యతో పాటు పాప, బాబు ఉన్నారు.

ప్రతి గడపకూ సంక్షేమం..



ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

● ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

సాలూరు: ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ప్రతి గడపకూ సంక్షేమం అందిస్తున్నారని ఉప ముఖ్యమంత్రి, గిరిజన శాఖా మంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. సంక్షేమ పాలన అందిస్తున్న జగనన్నను రానున్న ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించాలని పిలుపునిచ్చారు. మండలంలోని పెదబోరబంద పంచాయతీ పరిధి పెదబోరబంద, చినబోరబంద, దేవుబుచ్చింపేట, టి.బొడ్డవలస గ్రామాల్లో స్థానిక సర్పంచ్ కళ్లేపల్లి సరస్వతి అధ్యక్షతన ఎంపీడీఓ రమాదేవి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా తమ గ్రామాలకు వచ్చిన తమ ప్రియతమ నాయకుడు రాజన్నదొరకు మేళతాళాలతో ఆయా గ్రామాల ప్రజలు స్వాగతం పలికారు. కార్యక్రమంలో భాగంగా రాజన్నదొర, తదితరులు ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలపై వివరించారు. అలాగే స్థానిక సమస్యలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అత్యంత పారదర్శకంగా పాలన సాగిస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని చెప్పారు. ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచిన హామీల్లో 98 శాతం అమలు చేసిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. ప్రజలకు మేలు చేయాలన్నదే జగన్‌మోహన్‌రెడ్డి సిద్ధాంతమని తెలిపారు.

జగనన్న పాలనలోనే ప్రతి గడపకూ సంక్షేమం అందుతుందని పునరుద్ఘాటించారు. ప్రజలకు మేలు చేస్తున్న జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు త్రినాథ, ఎంపీపీ జి.రాములమ్మ, వైస్ ఎంపీపీ రెడ్డి సురేష్, జిల్లా గ్రంథాలయాల చైర్‌పర్సన్ రెడ్డి పద్మావతి, ఏఎంసీ చైర్‌పర్సన్ దండి అనంతకుమారి, ఏఎంసీ వైస్ చైర్మన్ బంకురు శ్రీనివాసరావు, ప్రజాప్రతినిధులు, నాయకులు దండి శ్రీనివాసరావు, సువ్వాడ రామకృష్ణ, పీడిక సుదర్శనదొర, సువ్వాడ భరత్‌శ్రీనివాస్, సింహాచలం, రాజారావు, తదితరులు పాల్గొన్నారు.

జేఏఎస్‌తో ప్రతి కుటుంబానికి అత్యుత్తమ వైద్యం

● డీఎంహెచ్‌ఓ జగన్నాథరావు



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.జగన్నాథరావు

పార్వతీపురంటౌన్: జగనన్న ఆరోగ్య సురక్ష(జేఏఎస్)తో ప్రతి కుటుంబానికి అత్యుత్తమ వైద్యం అందుతుందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ బి.జగన్నాథరావు అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన ప్రాథమిక పట్టణ ఆరోగ్య కేంద్రాల పరిధిలో గల ఆశ, నోడల్ అధికారులతో డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించి నిర్వహణపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ప్రతి కుటుంబానికి అత్యుత్తమ వైద్యం అందించడానికి ప్రజలందరికీ ఇంటివద్దే వైద్య పరీక్షలు, ఉచిత వైద్యసలహాలు, ఉచితంగా మందులు అందించనున్నామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఆర్‌బీఎస్‌కే అధికారి డాక్టర్ డి.ధవళ భాస్కర్, డీఐఓ డాక్టర్ జగన్‌మోహన్‌రావు, డీఎల్‌టీఓ డాక్టర్ శ్యామ్‌కుమార్, ఎఫ్‌డీపీ నోడల్ అధికారి డాక్టర్ వినోద్, ఎపిడమాలజిస్టు డాక్టర్ నవీన్‌కుమార్, డీపీహెచ్ఎన్ఓ ఉషారాణి, డీపీఓ లీలాకుమారి తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అదనపు ఆదాయం



వరి కాంపొండ్ బాక్సులను పరిశీలిస్తున్న ప్రకృతి వ్యవసాయ డీపీఎం షణ్ముఖరాజు

పార్వతీపురం టౌన్: ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో రైతులకు అదనపు ఆదాయం చేకూరుతుందని ప్రకృతి వ్యవసాయ డీపీఎం షణ్ముఖరాజు అన్నారు. ఈ మేరకు గురువారం పార్వతీపురం మండలం పెద బొండపల్లి గ్రామంలో వరి కాంపొండ్ బాక్స్‌లను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 3 నుంచి 5 అడుగుల వెడల్పు ఉన్న వరిగట్లపై శాశ్వత జీవామృత కుండీలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. గట్లపై బెండ, చిక్కుడు, కంది, బంతి, బీర, వంగ, మునగ, బొప్పాయి వంటి పంటలను గట్లపై వేసి రైతులు అదనపు ఆదాయం సంపాదించవచ్చునన్నారు. 365రోజులు కూడా ప్రకృతి వ్యవసాయం పంటలను పండించుకుని దిగుమతులు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యం



లచ్చయ్యపేటలో జగనన్న పింఛన్ కానుకలు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ, సర్పంచ్, ఎంపీటీసీ

సీతానగరం: రాష్ట్రంలో జగనన్న ప్రభుత్వం ప్రజాసంక్షేమమే ధ్యేయంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలని జెడ్పీటీసీ మామిడి బాబ్జీ కోరారు. ఈ మేరకు కొత్తగా మంజూరుచేసిన జగనన్న పింఛన్ కానుకలను మండలంలోని లచ్చయ్యపేటలో సర్పంచ్ సీహెచ్ కృష్ణ ఆధ్వర్యంలో ఎంపీటీసీ ఎ.సింహాచలంతో కలిసి ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ బాబ్జీ మాట్లాడుతూ ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆధ్వర్యంలో గడపగడపకు మనప్రభుత్వం, జగనన్న సురక్ష కార్యక్రమాల్లో ఇంటింటికీ వెళ్లినసమయంలో ప్రతి కుటుంబానికి ఏదో రూపంలో సంక్షేమ పథలు మంజూరు చేయాలన్న సంకల్పంతో అధికారులు అర్హుల జాబితాలను తయారుచేశారన్నారు.నవరత్నాల పథకం ద్వారా ప్రభుత్వం 95 శాతం కుటుంబాలకు సంక్షేమ పథకాలు అమలు చేసిందని చెప్పారు. మిగతా 5 శాతం మంది లబ్ధిదారులను ప్రజా ప్రతినిధులు, అధికారులు పరిశీలించి ఎంపిక చేశారన్నారు. ఈ నేపథ్యంలో మండలంలో 600 పింఛన్‌లు కొత్తగా మంజూరు చేశారన్నారు. ఇదిలా ఉండగా మరిపవలసలో సర్పంచ్ సీహెచ్ అప్పలనర్సమ్మ, ఎంపీటీసీ బి.వరలక్ష్మి, సచివాలయ కన్వీనర్ నాగరాజు, బగ్గందొరవలస సచివాలయంలో దివ్యాంగులకు సర్పంచ్ నారాయణరావు, సీడీసీ మాజీ చైర్మన్ ఎన్ రామకృష్ణ, సచివాలయ కన్వీనర్లు సూర్యనారాయణ, బి జగన్నాథం ఆధ్వర్యంలో వలంటీర్లు జగనన్న పింఛన్ కానుకలు పంపిణీ చేశారు.

పొత్తుల సంగతి ప్రజలే తేలుస్తారు...

● ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి

వీరఘట్టం: రాష్ట్రంలో టీడీపీ, జనసేన పార్టీల పొత్తులపై ప్రజలు దుమ్మెత్తిపోస్తున్నారని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. వండవ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కళావతి విలేకర్లతో గురువారం మాట్లాడారు. 2014 నుండి 2018 మధ్యకాలంలో జనసేన అధినేత పవన్‌కళ్యాణ్, టీడీపీ నేత నారా లోకేష్ తమ సభలలో ఒకరిపై ఒకరి ఇష్టానుసారంగా తిట్టుకున్నారని గుర్తు చేశారు. తర్వాత 2019లో వచ్చిన సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ చేతిలో చిత్తుగా ఓడిపోయిన తర్వాత టీడీపీ, జనసేన దోస్తీ కట్టారని, మళ్లీ ఇప్పుడు టీడీపీతో పొత్తుపెట్టుకుంటున్నట్లు పవన్ కళ్యాణ్ ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబును అరెస్టు చేయడం తప్పు అని వాదిస్తున్నారే తప్ప ఆయన చేసిన స్కిల్ స్కామ్‌పై జనసేన అధినేత పవన్ ఎందుకు నోరు విప్పడం లేదని ప్రశ్నించారు. చట్టం వీళ్లకు ఏమైనా చుట్టమా...చట్టం దృష్టిలో అందరూ సమానమే... తప్పు చేస్తే ఎంతటి వారికైనా శిక్ష తప్పదని అన్నారు. వీరి పొత్తులను ప్రజలు చిత్తు చేసే రోజులు దగ్గరలోనే ఉన్నాయని, 2024 తర్వాత టీడీపీ, జనసేన అడ్రస్‌లు గల్లంతవ్వడం ఖాయమన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే వైఎస్సార్‌సీపీకి శ్రీరామరక్ష అని ఎమ్మెల్యే కళావతి అన్నారు.

సచివాలయ సిబ్బంది పనితీరు మార్చుకోవాలి

పాలకొండ: సచివాలయ సిబ్బంది పనితీరు మార్చుకోవాలని డీఎల్‌డీఓ వివి.గోపాలకృష్ణ హెచ్చరించారు. మండలంలోని నవగాం సచివాలయాన్ని ఆయన గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ సిబ్బంది పనితీరు పరిశీలించి అసంతృప్తిని వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఉన్నత ఆశయంతో సచివాలయాలను ఏర్పాటు చేసిందని, ప్రజలకు సేవలు సకాలంలో అందించాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందని స్పష్టం చేశారు. విధులకు సక్రమంగా హాజరు కావడంతో పాటు సిటిజన్ చార్టు ప్రకారం సేవలు అందించాలని తెలిపారు.

ఘనంగా హిందీ దివస్

మక్కువ: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో హిందీ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఇన్‌చార్జ్ హెచ్ఎం ప్రసాదరావు ఆధ్వర్యంలో విద్యార్థులకు నాట్యం, దింసా నృత్యం, బాల్‌గీత్, సామెతలు, హిందీ సినిమా నృత్య పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జనార్దనరావు, శ్యామల, ఉషారాణి, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాలకు వేలం రేపు

మక్కువ: సారా తరలింపులో పట్టుబడ్డ ఏడు ద్విచక్ర వాహనాలకు శనివారం వేలంపాట వేయనున్నట్లు ఎస్సై జి. పైడిరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన వారు పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఆ రోజు ఉదయం ఆధార్ కార్డుతో సహా హాజరుకావాలని కోరారు.

ఉల్లాసంగా... ఉత్సాహంగా..



గెలుపొందిన క్రీడాకారులతో ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు

పాలకొండ రూరల్: చదువులతో పాటు క్రీడల్లో సత్తా చాటాలని ఎం.సింగుపురం సర్పంచ్ రణస్థలం రామా రాంబాబు అన్నారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో గురువారం నిర్వహించిన ప్రభుత్వ పాఠశాల క్రీడా సమాఖ్య ఆటల పోటీలను సర్పంచ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో నాలుగు మండలాలకు చెందిన 20 పాఠశాలల నుంచి అండర్ -14, 17 విభాగాలకు నిర్వహించిన కబడ్డీ, ఖోఖో, వాలీబా ల్, షటిల్, త్రోబాల్, పరుగు పందేల్లో బాల, బాలి కలు తమ ప్రతిభ కనపర్చారు. హెచ్ఎం బి.సంఘమేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా సిలువ దేవాలయ వార్షికోత్సవం



పరిశుద్ధ సిలువ దేవాలయంలో ప్రసంగిస్తున్న ఫాదర్లు

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలో ఉన్న పరిశుద్ధ సిలువ దేవాలయం 25వ వార్షికోత్సవం గురువారం సవర కోటపాడు విచారణ గురువు, ఫాదర్ ఛార్లెస్, కతోలిక సంఘం ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న బత్తిలి విచారణ గురువు రెవరెన్ ఫాదర్ థోమస్ రెడ్డి హాజరై పాపాన్ని వదిలి ప్రేమ, శాంతి, సమాధానాలతో ప్రజలు జీవించాలని దైవ సందేశాన్ని అందించారు. మహోత్సవ కార్యక్రమానికి గుమ్మలక్ష్మీపురం, ఎల్విన్‌పేట, సవర కోటపాడు, లక్కగూడ, కొండవారిగూడ, పి.లేవిడి తదితర గ్రామాల నుంచి వందలాది మంది క్రైస్తవ భక్తులు హాజరై ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

గిరిజన విద్యార్థుల కోసం...



జూనియర్ కళాశాలలో వాష్‌బేసిన్ల వద్ద ఏర్పాటు చేసిన కొత్త ట్యాపులు

గుమ్మలక్ష్మీపురం: తన స్నేహితుడిచ్చిన ఆర్థిక సాయంతో గుమ్మలక్ష్మీపురం మండలంలోని భద్రగిరి ఏపీటీడబ్ల్యూఆర్ జూనియర్ కళాశాల(బాయ్స్)లో కనీస వసతులు కల్పిస్తున్నట్లు ప్రిన్సిపాల్ యుగంధర్ తెలిపారు. ఇటీవల తన పుట్టిన రోజు సందర్భంగా విష్ చేసిన తన స్నేహితుడు కామేష్ ఏం చేయాలని అడుగగా.. కళాశాలలోని గిరిజన విద్యార్థులకు సౌకర్యాలు కల్పించేందుకు ప్రోత్సా హం అందివ్వాలని కోరగా.. తక్షణమే రూ.25వేలు ఆర్థిక సాయాన్ని అందించారని, ఆ సాయంతో కళాశాలలోని మరుగుదొడ్లు, ఆర్వో ప్లాంట్, వాష్ బేషిన్ల వద్ద పాడైపోయిన ట్యాప్‌లన్నింటిని తొలగించి వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. తరగతి గదుల్లో మెరుగైన విద్యుత్ బల్బులను అమర్చామన్నారు. మరుగుదొడ్లలో పాడైన డోర్లు, ప్రధాన గేట్‌లను కూడా మరమ్మతు చేయించినట్టు తెలిపారు.

తనిఖీలు పక్కాగా నమోదు చేయాలి

● డీఐఓ జగన్‌మోహన్‌రావు



వసతి గృహంలో రికార్డులు పరిశీలిస్తున్న డీఐఓ జగన్‌మోహన్‌రావు

పార్వతీపురంటౌన్: విద్యార్థుల ఆరోగ్య తనిఖీల వివరాలు పక్కాగా నమోదు చేయాలని డీఐఓ డాక్టర్ జగన్‌మోహన్‌రావు సూచించారు. స్కూల్ హెల్త్ కార్యక్రమంలో భాగంగా గురువారం మహాత్మాజ్యోతిబాపూలే రెసిడెన్షియల్ పాఠశాలను వైద్యసిబ్బందితో కలిసి సందర్శించారు. అక్కడ విద్యార్థులతో మాట్లాడి ఆరోగ్య స్థితిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఈ మధ్య చేపట్టిన హిమోగ్లోబిన్ నమోదు వివరాలను రికార్డుల్లో పరిశీలించి, వారికి వేస్తున్న ఐరన్ ఫోలిక్‌యాసిడ్ వివరాల నమోదును ఆన్‌లైన్‌లో పరిశీలించారు. రక్తహీనత గుర్తించిన విద్యార్థులకు ఏవిధంగా మాత్రలు వేస్తున్నారని, వారి పర్యవేక్షణ ఏవిధంగా ఉందని సిబ్బంది అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల్లో ఎవరికైనా ఆవేశం, కండరాల నొప్పులు, ఆకలి మందగించడం, దృష్టిలోపం, జ్వరం, చర్మవ్యాధులు తదితర ఆరోగ్యపరమైన సమస్యలు ఉన్నాయా అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. చిన్నపాటి ఆరోగ్య సమస్యలు ఉన్న విద్యార్థులకు ఆరోగ్య పరిశీలన చేసి తగు సూచనలు ఇచ్చారు. విద్యార్థులకు పలు ఆరోగ్య పరిశీలన చేసి తగు చికిత్స, సూచనలు చేసి పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యాలయ డెమో యోగేశ్వరరెడ్డి, హాస్టల్ స్టాఫ్ నర్సు సీహెచ్ గౌతమి, వైద్యసిబ్బంది జయగౌడ్, సావిత్రి, వసతి గృహ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హిందీ భాషాదివస్



నిడగల్లులో విద్యార్థులు వేసిన 'హిందీ' అక్షర మాలిక

సీతానగరం: విద్యార్థులంతా హిందీ భాష ప్రాముఖ్యతను తెలుసుకుని గ్రామాల్లో అందరికీ తెలియజేయాలని నిడగల్లు ఉన్నత పాఠశాల హెచ్ఎం ఎం.శివున్నాయుడు కోరారు. ఈ మేరకు గురువారం జాతీయ భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని నిడగల్లు ఉన్నత పాఠశాల హిందీ టీచరు ఎం.గోపీనాథ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వక్తృత్వం, వ్యాసరచన పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలను, విద్యార్థులతో హిందీ అక్షర మాలికను వేయించారు. ఈ సందర్భంగా హెచ్ఎం శివున్నాయుడు హిందీ భాష విశిష్టతను వివరిస్తూ హిందీభాషను అలవర్చుకున్న వారు భారతదేశంలోనే కాకుండా ఇతర దేశాల్లో విషయాలను తెలుసుకుని ప్రయాణం సులువుగా చేయవచ్చన్నారు. హిందీ టీచర్ గోపీనాథ్ మాట్లాడుతూ విద్యార్థులంతా తెలుగు, ఇంగ్లీష్, హిందీ భాషలను నేర్చుకుని దేశంలో ఎక్కడైనా ఉపాధి అవకాశాలు పొందడానికి సులభతరం అవుతుందన్నారు. అనంతరం హిందీ భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన పోటీలలో విజేతలకు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు.

గిరిజన యువకుడికి ఆర్థిక సాయం



ప్రశాంత్ కుటుంబ సభ్యులకు నగదును అందజేస్తున్న వాట్సాప్ గ్రూప్ సభ్యులు

కురుపాం: మండల కేంద్రంలోని మంతినివలస గిరిజన గ్రామానికి చెందిన కాకుల ప్రశాంత్ కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ శ్రీకాకుళం జెమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. రూ.లక్షల్లో డబ్బులు అవసరం కావడంతో స్థానిక కురుపాం డైలీ న్యూస్ వాట్సాప్ గ్రూప్‌లో ప్రశాంత్ ఆరోగ్యంపై పోస్టు పెట్టగా గ్రూప్‌లో ఉన్న సభ్యులు తమ వంతు సాయంగా నగదు రూ.24 వేలు సమకూర్చి సంబంధిత కుటుంబ సభ్యులకు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా గ్రూప్ సభ్యులు పొట్నూరు రవికుమార్, కొత్తకోట రవికుమార్, బరాటం చంద్రమౌళి, గుంప స్వామి, గౌడు గోపాలరావు మాట్లాడుతూ ఆరోగ్య సమస్య పరిష్కారానికి తమ వంతు సాయం ఎప్పుడైనా అందిస్తామని తెలిపారు. వాట్సాప్ గ్రూపు సభ్యులకు పలువురు అభినందించారు.